

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

గూడూరు, (వి.వి): లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని జర్నలిస్టులు, పోలీసులు, రెవెన్యూ, స్వచ్ఛందసంస్థలు, లయన్, రోటరీ క్లబ్‌వారికి మార్చి 17, 18 తేదిలలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మునిగిరీష్ అన్నారు. ఆదివారం స్థానిక అల్లూరి ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మునిగిరీష్ మాట్లాడుతూ మార్చి 10వ తేదిన లోగోలు, టీషర్టులను విడుదల చేస్తామన్నారు. కావున టీమ్‌లకు సంబంధించినవారు ప్రతిఒక్కరూ పాల్గొనాలని వారి వారి పేర్లను, జాబితాలను త్వరగా తయారు చేసి ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, అనిల్, రోటరీ అధ్యక్షుడు, లయన్ సెక్రటరీ తోట సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## 28న జాతీయ సైన్స్‌దినోత్సవ వేడుకలు

కావలి(వి.వి) : జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈనెల28తేదిన జాతీయ సైన్స్‌దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధ్యక్షులు టివిఎంఎన్ ప్రకాష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కూరగాయలమార్కెట్ ప్రక్కనేవున్న ది హోల్‌సేల్ క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్స్ కళ్యాణమండపంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమానికి జనవిజ్ఞానవేదిక పట్టణ ఉపాధ్యక్షురాలు సి.శారద వహిస్తారన్నారు. ముఖ్య అతిధులుగా జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా॥కె.మాశిలామణి, కావలి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీమతి పి.ఇందిర హాజరౌతారని తెలిపారు. ఈకార్యక్రమంలో అవార్డు గ్రహీత ప్రముఖ ఇంద్రజాలకుడు టైగర్ మహ్మద్ బృదంచే ఇంద్రజాల ప్రదర్శన వుంటుందన్నారు. సాంప్రదాయ తెలుగు అమ్మాయి పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



## రాపూరులో ఉచిత మెగా వైద్యశిబిరం

రాపూరు,(వి.వి): మండల కేంద్రమైన రాపూరు పట్టణంలోని సివికె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం శ్రీ రత్నం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం జరిగింది. ఆదివారం జరిగిన ఈ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు. దగ్గు, ఆస్తమా, ఆయాసం, ఉబ్బసం, నెమ్ము, బ్రాంకైటిస్, ఇస్నోఫిలియా, టిబి, నిమోనియా, చిన్న పిల్లల నెమ్ము వ్యాధులకు సంబంధించి డాక్టర్ పిట్టి మల్లికార్జున్‌రావు పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భకోశ వ్యాధి నిపుణులు డా. కె. భారతి వైద్యశిబిరంలో పాల్గొని మహిళలకు గర్భసంబంధమైన వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

## సమ్మెను జయప్రదం చేయండి

గూడూరు రూరల్,(వి.వి) :దేశ వ్యాప్తంగా 28వ తేది 11 కార్మిక సంఘాలు చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. యుటిఎఫ్ జిల్లా సభ్యులు కేశవులు మాట్లాడు తూ ప్రభుత్వ శాఖలలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అధిక ధరలను తగ్గించాలని, వస్త్ర వ్యాపారులపై విధించిన వ్యాట్ ట్యాక్స్‌ను తొలగించాలని, 2004లో ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలని, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ బ్యాక్‌లాగ్ పోస్టుల ను భర్తీచేయాలని, నిరుద్యోగ భృతి కల్పించాలనే డిమాండ్లతో సమ్మె నిర్వహిస్తున్నా మని, ఈ సమ్మెకు అన్ని కార్మిక సంఘాల నాయకులు జయప్రదం చేయాలని కోరారు.

## పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

గూడూరు రూరల్,(వి.వి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉప విద్యాశాఖాధికారి ప్రసన్నాంజనేయులు అన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధన కోసం జిల్లా పరిషత్ పాఠశాలల్లో సకాలంలో సిలబస్ పూర్తి చేయటమే కాక, ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించి, వారిలో వెనుకబడిన పిల్లలను సి, డి గ్రేడ్‌లుగా విభజించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్నదే తమ ధ్యేయమని, జిల్లాలోని ప్రతి పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా వాలంటీర్లను ఏర్పాటు చేసి రాత్రివేళలలో ప్రత్యేక తరగతులు, దాతల సహకారంతో విద్యార్థులకు పౌష్టికాహారం, వెనుకబడిన విద్యార్థులు కనీస ఉత్తీర్ణత పొందేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## లేఅవుట్లకు తప్పనిసరిగా పర్మిషన్ ఉండాలి

వింజమూరు, (వి.వి): మండల పరిధిలోని వ్యవసాయానికి సంబంధించిన భూములకు, వాటిని వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు తప్పనిసరిగా పర్మిషన్ ఉండాలని, కావలి ఆర్‌డిఓ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. వారు రెండు పొలాలకు సంబంధించిన పట్టాలను పరిశీలించి మాట్లాడుతూ వ్యవసాయ భూములన్నీ ఇండ్ల స్థలాలుగా మార్చేటపుడు కన్వర్షన్ ఫీజు చెల్లించాలని, వింజమూరులో మొత్తం 28 లేఅవుట్లకు గాను 20 లేఅవుట్లకు ఫీజు చెల్లించారని, మిగతావాటికి తప్పకుండా కన్వర్షన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డివోతోపాటు తహశీల్దార్ కె.వి. రమణయ్య, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.





## వసతి గృహ విద్యార్థులకు రెడిమేడ్ దుస్తులు పంపిణీ

కోట,(వి.వి) : కోట పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతిగృహాలలోని పదవ తరగతి చదువుకునే విద్యార్థులకు ఆదివారం ఎస్సై వెంకట్రావు చేతుల మీదుగా రెడిమేడ్ దుస్తులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని చెందోడు గ్రామానికి చెందిన ఎంవి రావ్ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వసతిగృహాలలో నివసించే 30మంది విద్యార్థులకు రెడిమేడ్ దుస్తులను ఇవ్వగా, ఎస్సై పంపిణీ చేశారు. వచ్చే నెల మార్చి 26 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరుశాతం లక్ష్యాలు సాధించాలని, ప్రతి ఒక్కరూ పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులు కావాలని కోరుతూ కీర్తిశేషులు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనం చేశారు. అనంతరం ఎస్సై వెంకట్రావు మాట్లాడుతూ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని సంస్థ సేవలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు వెంకటరమణయ్య, పెంచలయ్య, విజయమ్మలతో పాటు ఎంవి రావ్ ఫౌండేషన్ ఛైర్మన్ లీలామోహన్‌కృష్ణ, నిర్వాహకులు విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్షల్‌ఆర్ట్స్ ఒక్కటి నేర్చుకుంటే 63 కళలు నేర్చుకున్నట్లే..!



గూడూరు,(వి.వి): మన పెద్దలు 64 కళలున్నాయని అంటుంటారు. వాటిలో ఈ మార్షల్ ఆర్ట్స్ ఒకటని, ఇది మిగిలిన కళలకు బేస్‌మెంట్‌లాంటిదని, దీనిని నేర్చుకుంటే మిగతా 63 కళలు కూడా నేర్చుకోవచ్చని పిఆర్ క్లబ్ అధ్యక్షుడు మాజీ ఎంఎల్‌ఏ ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పాతబస్టాండు వద్ద గల పిఆర్ క్లబ్‌లో ద యునైటెడ్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని వివిధ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు కరాటే కుంగ్‌ఫూ మొదలైన వాటిలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పిల్లల ఏకాగ్రత, ఫిట్‌నెస్ అభివృద్ధి జరగాలంటే ఇటువంటి పోటీలు నిర్వహించాల న్నారు. ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనేలా పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెజ్లర్‌లు ఆరిఫ్‌బాష, గౌస్‌బాష, షఫి, పిఆర్ క్లబ్ సెక్రటరీ మాజీ కౌన్సిలర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## 'కేర్ ఫర్ హెల్త్' ఉచిత వైద్యశిబిరంలో 350 మందికి పరీక్షలు

రాపూరు, (వి.వి): కేర్ ఫర్ హెల్త్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాపూరు మండలం సిద్దవరం గ్రామంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్యశిబిరంలో 350 మందికి పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా ఖరీదైన మందులను పంపిణీ చేశారు. వైద్యశిబిరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారికి ఆహార పొట్లాలను అందజేశారు. సిద్దవరం గ్రామంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్యశిబిరానికి రాపూరు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు సమీప మండలమైన డక్కిలి మండలంలోని డక్కిలి, మాధవయ్య పాలెం, వెలికల్లు, మార్లగుంట తదితర గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. డా.హిమబిందు శిబిరంలో పాల్గొని రోగులకు దంత పరీక్షలు నిర్వహించారు.దంతాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిగుళ్ళవాపు వచ్చినపుడు తీసుకోవాల్సిన చర్యలు తదితరవాటిపై సూచనలు ఇస్తూ రోగులకు అవగాహన కల్పించారు. డా.హిమబిందుతో పాటు వైద్యవిద్యార్థి నిర్మల కూడా పాల్గొని దంత పరీక్షలు నిర్వహిం చారు. అనంతరం జరిగిన కంటివైద్య శిబిరంలో వైద్యులు పాల్గొని రోగులకు కంటిపరీక్షలను నిర్వహించారు. అనంతరం కేర్ ఫర్ హెల్త్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ డా. కోకా హరప్రసాద్ రావు మాట్లాడుతూ రాపూరులాంటి మారుమూల ప్రాంతాలలో ప్రజలకు ప్రముఖంగా ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో త్వరలో రాపూరులోనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని స్వంతంగా ఏర్పాటు చేసి ఈ కేంద్రంలో ఒక నర్సు, ఇద్దరు హెల్త్ సహాయకులను ఏర్పాటు చేయడం జరుగుతుందని, నెలకు రెండు పర్యాయాలు వైద్యులు ఈ కేంద్రానికి వచ్చి పేదలకు వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ వైద్యశిబిరంలో కర్ణాటకకు చెందిన సంస్థ వాలంటీర్లు అశోక్‌కుమార్, అనంతనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది.







